ఏ కష్టమొచ్చిందో..?

ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి చాణక్యానందరెడ్డి

◆ హాస్టల్ పైనుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య

◆ చదువులో బెస్ట్.. అన్నింటిలోనూ మంచి మార్కులు

◆ కన్నీటి పర్యంతం అయిన తల్లిదండ్రులు

చదువుల్లో బెస్ట్ స్టూడెంట్... అన్నింటిలోనూ మంచి మార్కులే... మెరిట్ స్కాలర్‌షిప్ సైతం పొందుతున్న విద్యార్థి. అయితే అతనికి ఏ కష్టమెచ్చిందో ఏమో తెలియదు.. తానుంటున్న హాస్టల్ భవనం పైనుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉత్తమ విద్యార్థిగానున్న చాణక్యనందరెడ్డి ఈ రకంగా ఆత్మహత్యకు పాల్పడటం అధ్యాపకులను సైతం కంటతడి పెట్టించింది. రక్తపు మడుగులో యల్లోరా హాస్టల్ పక్కనున్న సిసిసి భవనం ముందు విగతజీవిగా పడిఉన్న విద్యార్థిని చూసి సహ విద్యార్థులు సైతం కన్నీటి పర్యవంతమయ్యారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నెల్లూరు జిల్లా వరికుంటపల్లి మండలం జి.కొండాపురం గ్రామానికి చెందిన చాణక్యనందరెడ్డి అనంతపురం జెఎన్‌టియులోని ఇసిఇ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. యల్లోరా హాస్టల్‌లో ఉంటున్న చాణక్యనందరెడ్డి గురువారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో హాస్టల్ పక్కనున్న సిసిసి భవనంలోకెళ్లి అక్కడి నుంచి కిందకు దూకాడు. రక్తపుమడుగులో పడిఉన్న అతడినిచూసి విద్యార్థులు సమచారాన్ని ప్రిన్సిపాల్ సుజాతకు తెలియజేశారు. ఆమె వన్‌టౌన్ పోలీసులకు సమాచారమివ్వడంతో పోలీసులు విచ్చేశారు. వన్‌టౌన్ సిఐ రవిశంకర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. రాత్రి తోటి స్నేహితలతో కలసి హాస్టల్‌లోని 131 గదిలో నిద్రించిన చాణక్యనందరెడ్డి తెల్లారేసరికి ఆత్మహత్య చేసుకుని కనిపించడం తోటి విద్యార్థులను విస్మయానికి గురిచేసింది. స్నేహితుడుకి తెల్లవారుజామున బై అని మెసేజ్ పెట్టగా, చెల్లెలుకు టేక్ కేర్ అని మెసేజ్ పెట్టి చనిపోయాడు.

చదువులో బెస్ట్..

చాణక్యనందరెడ్డి చదువుల్లో బాగా రాణిస్తూ వచ్చేవాడు. ఎంసెట్‌లో ఐదు వేల లోపు ర్యాంకు వచ్చింది. ఇసిఇ మొదటి సంవత్సరంలో 9.8 మార్కులు సాధించాడు. మెరిట్ స్కాలర్‌షిప్ సైతం సాధించాడు. చదువులో బాగా రాణిస్తున్న చాణక్యనందరెడ్డి ఈ రకంగాచనిపోవడం అందరినీ కలచివేసింది.

కన్నీటి పర్యవంతమైన తల్లిదండ్రులు

ఒక్కగానొక్క కుమారుడు చదవులో బాగారాణిస్తున్నాడు...మంచి భవిష్యత్ ఉంటుందని తల్లిదండ్రులు కోటి ఆశలు పెట్టుకున్నారు. కుమార్తెకు ఇటీవలనే నీట్‌లో సీటు వచ్చింది. కొడుకు, కుమార్తె ఇద్దరూ చదువులో ముందుకెళున్నారని తల్లిదండ్రులు భావించారు. అయితే ఉన్న ఫలంగా కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో కన్నీటి పర్యవంతం అయ్యారు. కుమారిని మృతదేహం వద్ద వారి రోదనలు చూపరులను కన్నీరు పెట్టించాయి.

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం

రవిశంకర్‌రెడ్డి, సిఐ.

విద్యార్థి మృతిపై వివరాలు సేకరిస్తున్నాం. ఆత్మహత్యకుగల కారణాలు ఏమిటన్న దానిపై స్పష్టతలేదు. పూర్తి స్థాయి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

పుస్తకంతో విజ్ఞానం

మాట్లాడుతున్న ఆర్‌జెడి వెంకట కృష్ణారెడ్డి

ఆర్డీవో మధుసూదన్



మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ ఎన్.వేణుగోపాల్

ప్రజాశక్తి పుస్తక ప్రదర్శనను ప్రారంభించి అందులోని పుస్తకాలను తిలకిస్తున్న గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి

◆ ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

◆ ప్రజాశక్తి బుక్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో ఆర్‌జెడి ఎం.వెంకటకృష్ణారెడ్డి, ఆర్‌డిఓ మధుసూధన్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పుస్తకం విజ్ఞానాన్ని నేర్పుతుందని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని ఆర్‌జెడి వెంటకకృష్ణారెడ్డి తెలియజేశారు. అనంతపురం నగరం పోలీస్ కాంప్లెక్స్‌లోని ప్రజాశక్తి బుక్‌హౌస్ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ప్రజాశక్తి అనంతపురం ఎడిషన్ మేనేజర్ ఎన్.వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్‌జెడితో పాటు ఆర్డీవో మధుసూదన్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. సాంకేతికంగా అభివృద్ధి సాధించిన రోజుల్లోనూ పుస్తకాలకు ఎంతో ఆదరణ ఉందన్నారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రజలకు అందుబాటు ధరలతో మంచి పుస్తకాలు అందించడం అభినందనీయం అన్నారు. ఆర్డీవో మధుసూదన్ మాట్లాడుతూ చిరిగిన చొక్కా అయినా వేసుకో కాని మంచి పుస్తకాన్ని కొనుక్కొని చదువుకో అంటూ మహాకవి శ్రీశ్రీ చెప్పిన మాటలు అక్షర సత్యం అన్నారు. పుస్తక పఠనంతో పొందే ఆనందం, అనుభూతి ఎంతో గొప్పదన్నారు. మనల్ని గత చరిత్రను, భవిష్యత్ కాలాన్ని కూడా తీసుకెళ్లే శక్తి పుస్తకాలకు ఉందన్నారు. నాటి చరిత్రను తెలుసుకోగలిగామంటే ఎందరో మహనీయులు తాళపత్ర గ్రంథాలు, పుస్తకాల్లో పొందుపరచడం ద్వారానే సాధ్యమైందన్నారు. మృగాలను కూడా మనిషిగా మార్చే శక్తి మంచి పుస్తకానికి ఉందన్నారు. మంచి పుస్తకం చేతిలో ఉంటే ఎన్నో అద్భుతాలు సృష్టించే శక్తి లభిస్తుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి మాట్లాడుతూ పుస్తకాలకు ఎంతో ఆదరణ ఉందన్నారు. సామాజిక చైతన్యానికి మంచి పుస్తకాలు ఆయుధంగా నిలిచాయని తెలిపారు. గ్రంథాలయంలో ఎంతో విలువైన చారిత్రాత్మకమైన, చైతన్యవంతమైన పుస్తకాలు ఉన్నాయని తెలిపారు. పాఠకుల కోసం 40 లక్షల పుస్తకాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. పుస్తక పఠనానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజాశక్తి మంచి మంచి పుస్తకాలను ప్రచురిస్తోందని అభినందనలు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ ప్రజాశక్తి పుస్తక ప్రదర్శనతో పుస్తక ప్రియులకు పండుగను తీసుకొచ్చినట్లు ఉందన్నారు. సెల్‌ఫోన్, ఫేస్‌బుక్, వాట్సప్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలు వచ్చాక 90 శాతం పుస్తక విక్రయాలు తగ్గినట్లు తెలుస్తోందన్నారు. ఇలాంటి పరిస్థితిలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. పుస్తకాలకు పూర్వవైభం తీసుకురావడం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. గ్రంథాలయాల ద్వారా ప్రతి కళాశాలలో బుక్‌క్లబ్ ఏర్పాటు చేయాలన్నారు. సాహితీవేత్తలతో పాటు అందరూ పుస్తక పఠనానికి నాంది పలకాలని కోరారు. ప్రజాశక్తి ఎడిషన మేనేజర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ నుంచి 13వ తేదీ వరకు పుస్తక ప్రదర్శన ఉంటుందన్నారు. నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ సందర్భంగా పుస్తకాలు డిస్కౌంట్‌తో విక్రయిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అతిథులందరూ ప్రజాశక్తి పుస్తక ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఆర్‌జెడి వెంకటకృష్ణారెడ్డికి గాంధీ భారతదేశం పుస్తకాన్ని బహుకరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఉమామోహన్‌రెడ్డి మహాకవి శ్రీశ్రీ సాహిత్య గ్రంథాన్ని కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం.బాషా, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్, రచయిత రియాజుద్దీన్, నానీల నాగేంద్ర, టివి.రెడ్డి, జూటూరు షరీఫ్, అశ్వర్థరెడ్డి, శ్రీహరిమూర్తి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, ప్రజాశక్తి బుక్‌హౌస్ ఇన్‌ఛార్జి శ్రీదేవి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యచంద్రయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీజీ రచించిన భారతదేశ చరిత్ర పుస్తకాన్ని ఆర్డీకి అందజేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

జగన్‌ను మరోసారి దీవించండి..

విప్ కాపు రామచంద్రారెడ్డి

బొమ్మనహాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

రాష్ట్రంలో వైఎస్ఆర్ పాలనను అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని విప్ కాపు రామచంద్రారెడ్డి కోరారు. ఈమేరకు మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ షకీలాబేగం ఆధ్వర్యంలో కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు, మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు చెపుతున్న అబద్ధాలను నమ్మవద్దని సూచించారు. టిడిపి పాలనలో 39 లక్షల మందికి పింఛన్లు ఇవ్వగా వైసిపి అధికారంలోకి వచ్చాక 62 లక్షల మందికి పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా గతంలో కొత్త పింఛన్లు కావాలంటే ఎవరైనా పాత పింఛన్ వస్తున్న వారు చనిపోతేనే ఇచ్చేవారన్నారు. అయితే ఇప్పుడు ప్రతి ఆరు నెలలకు ఒకసారి కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్న ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ఇకపోతే రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ ఏదో ఒక సంక్షేమ పథకాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఆఖరకు కరోనా సమయంలో కూడా ఒక్క పథకాన్నీ నిలిపిన దాఖలాలు లేవన్నారు. ఇకపోతే కరోనా విలయ తాండవం చేస్తుంటే రాష్ట్రంతోపాటు నియోజకవర్గంలో ఎక్కడా కనిపించని టిడిపి నాయకులు ఇప్పుడు నోటికి వచ్చినట్టు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కాపు రామచంద్రారెడ్డి ఇసుక, మట్టి అమ్ముతున్నాడని కాలవ శ్రీనివాసులు విష ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, ఉప ఎంపిపి రమేష్, సర్పంచులు యోగేశ్వర్‌రెడ్డి, పరమేశ్వర, కృష్ణ, ఆంజనేయ, గాదలింగ, ముక్కన్న, ఎంపిటిసిలు చిక్కన్న, తిమ్మప్ప, వైసిపి నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, జయరాంరెడ్డి, మనోహర్, రామకృష్ణ, రామాంజనేయులు, ఎంపిడిఒ సిబ్బంది, సీనియర్ సహాయకులు వెంకటేశులు, డిప్యూటీ తహశీల్దార్, పింఛన్‌దారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డి.హీరేహాల్ : వైసిపి ప్రభుత్వం అందిస్తున్న వైఎస్ఆర్ బీమా పేదలకు ధీమాగా నిలుస్తోందని విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టిడిపి పాలనలో పింఛన్ రావాలంటే జన్మభూమి కమిటీ సిఫార్సు మేరకే వచ్చేదన్నారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చాక పార్టీలకతీతంగా అందజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి హసీనాబాను, ఎంపిపి పవిత్ర స్వామి, మార్కెట్ యార్డు ఛైర్మన్ భోజరాజునాయక్, మండల కన్వీనర్ వన్నూరుస్వామి, సర్పంచులు హనుమంతురెడ్డి, లక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, బోయ మల్లికార్జున, దొనప్ప, నాగరాజు, ఎంపిడిఒ భాస్కర్‌బాబు, ఎంపిటిసి శివలింగ, హనుమక్క, నాయకులు రాళ్ల తిమ్మారెడ్డి, సురేష్, జగదీష్, గన్నిగౌడ, బసవరాజు, నాగ, ఎర్రిస్వామి, వెంకటేశులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా వివరాలను కలెక్టర్‌కు అందజేస్తున్న అధికారులు

జిల్లా ఓటర్లు 19,39,163

◆ పురుషులు 9,67,841

◆ మహిళలు 9,71,098 ◆ థర్డ్ జెండర్‌లు 224

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్పెషల్ సమ్మరీ రివిజన్-2023కు సంబంధించి అనంతపురం జిల్లా తుది ఓటర్ల జాబితా, సర్వీసెస్ జాబితాను గురువారం విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 19,39,163 ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 9,67,841, మహిళలు 9,71,098, థర్డ్ జెండర్‌లు 224 మంది ఉన్నారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే రాయదుర్గంలో మొత్తం ఓటర్లు 2,54,661 కాగా, ఇందులో పురుషులు 1,27,279 మంది, మహిళలు 1,27,356, థర్డ్ జెండర్‌లు 26 మంది ఉన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,15,481 మంది కాగ వీరిలో పురుషులు 1,07,342, మహిళలు 1,27,356, థర్డ్ జెండర్లు 26 మంది ఉన్నారు. గుంతకల్లుకు సంబంధించి 2,60,353 మంది మొత్తం ఓటర్లు కాగ వీరిలో పురుషులు 1,28,980, మహిళలు 1,31,299, థర్డ్ జెండర్లు 74 మంది ఉన్నారు. తాడిపత్రి పరిధిలో మొత్తం ఓటర్లు 2,39,216 మంది కాగ వీరిలో పురుషులు 1,19,864, మహిళలు 1,19,329, థర్డ్ జెండర్లు 14 మంది ఉన్నారు. శింగనమల నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,39,349 మంది కాగ వీరిలో పురుషులు 1,20,060, మహిళలు 1,19,275, థర్డ్ జెండర్లు 14 మంది ఉన్నారు. అనంతపురం అర్బన్ పరిధిలో మొత్తం ఓటర్లు 1,62,456 మంది కాగ వీరిలో పురుషులు 1,29,617 మహిళలు 1,32,795, థర్డ్ జెండర్లు 44 మంది ఉన్నారు. కళ్యాణదుర్గం పరిధిలో మొత్తం ఓటర్లు 2,22,234 మంది కాగ వీరిలో పురుషులు 1,11,589 మంది మహిళలు 1,10,641 థర్డ్ జెండర్లు నలుగురు ఉన్నారు. రాప్తాడు నియోజకవర్గం పరిధిలో మొత్తం 2,45,413 మంది కాగ పురుషులు 1,23,110, మహిళలు 1,22,290 థర్డ్‌జెండర్లు 13 మంది ఉన్నారు.

అంబేద్కర్ సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..

ఆందోళనలో ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

నియోజకవర్గవ్యాప్తంగా కల్తీ కల్లు తాగి ప్రజలు వారి ప్రాణాలను పోగట్టుకుంటున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోరా.. అని ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీ కల్లు దుకాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఆందోళన చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం చేరుకుని తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లు వ్యాపారులు విక్రయించే కల్లులో ఎక్కువ శాతం రసాయనాలు వేయడం వల్ల తీవ్రంగా నిషా ఎక్కి బానిసలు అవుతున్నారన్నారు. దీంతో కల్లు తాగకపోతే మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తున్నారన్నారు. ఇలాంటి ఘటనలు లేపాక్షి మండలంలో గతంలో చోటు చేసుకుంటున్నాయన్నారు. దీంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు బారిన ప్రజలు పడుతున్నారన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ కల్లు వ్యాపారులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు శ్రీరాములు, ఆర్‌సిపి నాయకులు శ్రీనివాసులు, ఇతర ప్రజా సంఘాల నాయకులు వినోద్‌కుమార్, చంటీ, రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పిస్తాం..ఖాళీ చేయండి..

పూల వ్యాపారులతో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ - రోడ్డుపై పూలేసి వ్యాపారుల నిరసన

రోడ్డుపై పూలు పడేసి ఆందోళన చేస్తున్న పూల వ్యాపారులు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో నూతనంగా నిర్మించిన వాణిజ్య భవన సముదాయంలో సౌకర్యాలు కల్పిస్తామని, వెంటనే ఖాళీ చేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ సూచించారు. గురువారం పట్టణంలోని పశువర్ధక శాఖ డిడి కార్యాలయ ఆవరణలో పూలవ్యాపారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మార్కెట్ నిర్మాణం పూర్తయి ప్రారంభమైనప్పటికీ వ్యాపారులు దుకాణాలను మార్చలేదన్నారు. వెంటనే ఖాళీ చేయాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో వ్యాపారులు పూలను రోడ్డుపై పడేసి ఆందోళన చేశారు. అనంతరం ఎమ్మెల్సీ నివాస గృహానికి వెళ్లారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో మున్సిపల్ కార్యాలయానికి వచ్చి, మున్సిపల్ ఛైర్‌పర్సన్‌తోపాటు వైస్ ఛైర్మన్ జబీవుల్లాలను కలిసి సమస్యను వివరించారు. తమకు కేటాయించిన స్థలంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతోనే ఇప్పటి వరకు మార్కెట్‌లో లావాదేవీలు చేసుకోలేకపోతున్నామనానరు. సౌకర్యాలు కల్పిస్తే వెంటనే మార్కెట్‌లో వ్యాపారాలు చేస్తామని వివరించారు. ఇందుకు ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్ మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన మార్కెట్‌లో పూల వ్యాపారులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, వెంటనే ఖాళీ చేయాలని సూచించారు. అయితే పశువర్ధక శాఖ అధికారులతో చర్చించి మరో రెండు నెలలు గడువు ఇచ్చించాలని వ్యాపారులు కోరగా ఇప్పటికే చాలాసార్లు వారితో గడువు ఇప్పించామని, రూ.కోట్లు ఖర్చు చేసి మార్కెట్ నిర్మిస్తే వ్యాపారులు చేసుకోకపోతే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాలోత్సవం బ్రోచర్లు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలోని ప్రజాశక్తి బుక్‌హౌస్‌లో గురువారం అనంత బాలోత్సవం-2023 బ్రోచర్లను ఆర్‌జెడి, ఇన్‌ఛార్జి డిఇఒ ఎం.వెంకటకృష్ణారెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంత బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 27, 28, 29వ తేదీల్లో నగరంలోని కొత్తూరు బాలుర జూనియర్ కళాశాల మైదానంలో పిల్లల పండుగను నిర్వహించనున్నట్లు తెలిపారు. పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ నాయకులు శ్రీనివాసరావు, కోటేశ్వరప్ప, లింగమయ్య, రమణయ్య, రవిచంద్ర, సురేష్, సురేష్‌చంద్రయాదవ్, పరమేష్, రామాంజినమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవం బ్రోచర్లను విడుదల చేస్తున్న ఆర్‌జెడి వెంకట కృష్ణారెడ్డి, బాలోత్సవ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వైపి.రమణారెడ్డి

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

పెద్దవడుగూరు : ప్రజాశక్తి 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను డ్వామా జిల్లా విజిలెన్స్ అధికారి వైపి.రమణారెడ్డి, ఎంపీడీవో కుళ్లాయిస్వామి, ఏపీవో పుల్లారెడ్డిలు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డ్వామా విజిలెన్స్ ఆఫీసర్ రమణారెడ్డి మాట్లాడుతూ.. కార్మిక, కర్షక పక్షపాతి పత్రిక ప్రజాశక్తి అని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆ పత్రిక ఎంతో కృషి చేస్తోందన్నారు. శక్తివంతమైన కథనాలు ప్రచురిస్తోందని తెలిపారు. తెలుగు ప్రజల హృదయాల్లో మంచి స్థానం సంపాదించుకుందని కొనియాడారు. ఎంపీడీవో కుళ్లాయిస్వామి మాట్లాడుతూ ప్రజా పోరాటాలకు దన్నుగా, అభ్యుదయ భావాలకు వెన్నెముకగా ప్రజాశక్తి నిలుస్తోందన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి ప్రజలకు, అధికారులకు మధ్య వారధిగా ఉంటోందని తెలిపారు. పత్రిక మరింత ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాశక్తి విలేఖరి యక్కలూరు రామాంజనేయులు, జాతీయ గ్రామీణ ఉపాది. మండల టిఎలు వనం రామాంజనేయులు, బాలఉసేన్, సుందరం, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రక్తహీనత పరీక్షలు

ఆత్మకూరు : బి.యాలేరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లోని పిల్లలకు జిల్లా అసంక్రమిత వ్యాధుల పర్యవేక్షణ విభాగం అధికారి డాక్టర్ నారాయణస్వామి పర్యవేక్షణలో గురువారం రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. దాదాపు 24 మంది పిల్లలకు పరీక్షలు చేశారు. మెల్లకన్ను ఉన్నవారిని గుర్తించి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి రెఫెర్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఉప్పులో అయోడిన్ శాతం పరీక్షలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే వైఎస్సార్ సంపూర్ణ పోషణ ఆహారాన్ని పరీక్షించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వామి, ఎంపిహెచ్ఇఒ నాగేశ్వరయ్య, ఎఎన్ఎం ప్రమీల, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ జ్యోతి, ఆశాలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

నార్పల : మండల పరిధిలోని సోదనపల్లి, గుంజేపల్లి, పప్పూరు గ్రామల సచివాలయలను ఈవోఆర్డీ లక్ష్మీనరసింహ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా పంచాయతీలలోని చెత్త సంపద కేంద్రాలనులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామపంచాయతీ, సచివాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఆరోగ్య విషయంలో సూచనలు సలహాలు ఇవ్వాలని ఆదేశించారు. గ్రామాల్లో ఫాగింగ్ చేపట్టాలని, స్ప్రేయింగ్ చేయాలని ఆదేశించారు. ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాలను బాగా పనిచేసేలా చూడాలన్నారు. ఇంటి పన్నుల వసూలు బాగా చేయాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పరమేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సూర్య కళావతి రాయుడు, సూర్యనారాయణ, గ్రామ సచివాల సిబ్బంది చైతన్య, జగదీష్ పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

పెద్దపప్పూరు : పెద్దపప్పూరు మండల కేంద్రంలోని చౌడేశ్వరిదేవి దేవస్థానంలో తొగటవీర క్షత్రియ సంఘం 2023 నూతన క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మిద్దె నాగరాజు, ఉపాధ్యక్షులు చింతా పురుషోత్తం, ఉపాధ్యక్షులు చందా పెద్ద చిదంబరి, ఆలయ ధర్మకర్త చింతా కర్ణ హాజరై క్యాలెండరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుడి అర్చకులు పరిచే నారాయణస్వామి, చింతా సాంబశివ, బండారు ప్రకాష్, చింతా ప్రసాదు, చింతా వెంకటరమణ, లింగం వీరమల్లేసు, లింగం నరసింహులు, తొండూరు చిన్నరాముడు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

బుక్కరాయసముద్రం : చెత్తను సేకరించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపిడిఒ తేజోత్స్న సూచించారు. కొర్రపాడు గ్రామంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ.. గ్రామంలో సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాలకు తరలించి వర్మీకంపోస్ట్‌ను తయారు చేస్తామన్నారు. వర్మీకంపోస్టుపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. వారి సహకారంతో గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని గ్రామ పంచాయతీ, సచివాలయ సిబ్బందికి సూచనలు ఇచ్చారన్నారు. అనంతరం ఎంపిడిఒ మండల ప్రజా పరిషత్ సాధారణ నిధుల ద్వారా వేసిన డ్రెయినేజీ పనులను పరిశీలించారు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S NO. 269/ 2021
M.చంద్రశేఖర్ రెడ్డి. ...వాది
-Vs-
గులి.లక్ష్మీనారాయణ రెడ్డి. ...ప్రతివాది
ప్రతివాదికి దావా సమన్సు
గులి.లక్ష్మీనారాయణ రెడ్డి తండ్రి
G. కేశవ రెడ్డి, వ్యాపారం, తిమ్మపల్లి గ్రామం,
తాడిపత్రి (మం), అనంతపురం జిల్లా.
పై నంబరు దావాలో వాది ప్రతివాది నుండి దావా మొత్తము రూ. 1,03,160/- లు, ఇందుపైన ముందు వడ్డీ మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైనా అక్షేపణలు వున్న యెడల 31-1-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతం ములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్ష మున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియ జేడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
తేది : 31-1-2023
M. జయభరత్ రెడ్డి.
N. రాఘవా చార్యులు.
వాది పరం న్యాయవాదులు, కర్నూలు.

జీవో1 రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-గుంతకల్లు

సీఎం జగన్‌రెడ్డి రాజకీయ దురుద్దేశంతో కొత్త ఏడాది రాత్రి తీసుకువచ్చిన జిఒ1 రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, దాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. గురువారం గుంతకల్లుకు వచ్చిన ఆయన స్థానిక హంపిరెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం జగన్‌రెడ్డి సభలు, ప్రదర్శనలు నిషేధిస్తూ నూతన సంవత్సర కానుకగా రాత్రికి రాత్రి తీసుకువచ్చిన జిఒ1 రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, ప్రజాస్వామ్యా నికి భంగపాటని అన్నారు. అది పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో చేసినదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువస్తే స్పందించని సందర్భంలో రోడ్లపైకి వస్తే ప్రజల తొక్కిసలాట, అసౌకర్యం అవుతుందన్న సాకుతో వైసిపి ప్రభుత్వం జిఒ1 తీసుకురావడాన్ని హోంశాఖ వెంటనే మోదించి అమలులోకి తీసుకురావడం అప్రజాస్వామికం అన్నారు. చంద్రబాబు పర్యటనల్లో జరిగిన తొక్కిసలాటలో 11 మంది చనిపోవడం దురదృష్టకరమన్నారు. ఐతే అలాంటి సందర్భాల్లో నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభుత్వాలు తగిన రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఐతే ఆ పునాదులపై అధికారంలోకి వచ్చిన సిఎం జగన్‌రెడ్డి దాన్నే సాకుగా చూపి ప్రజాస్వామ్యం గొంతు నొక్కుతూ ర్యాలీలు, ప్రదర్శనలపై నిషేధం విధిస్తూ జిఒ1 జారీచేయడం అప్రజాస్వామికం అన్నారు. రాజకీయ పార్టీలు ప్రజా సమస్యలను ప్రభుత్వాలకు తెలిపేందుకు, పార్టీల విధానాలను ప్రజలకు తెలిపేందుకు సభలు, సమావేశాలు పోలీసులు అనుమతి ఇచ్చిన ఎక్కడో కొండల్లో, గుట్టల్లో రాళ్లకు రప్పలకు చెప్పాలా అని ప్రశ్నించారు. ఇది సరికాదన్నారు. జిఒ ఇచ్చిన మరుసటి రోజే సీఎం జగన్‌రెడ్డి రాజమండ్రిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రజల మధ్యనే నిర్వహించారన్నారు. ఆ జిఒ అధికార పార్టీకి వర్తించదా అన్నారు. అధికారంలో ఉంటే ఏమైనా చేసుకోవవచ్చన్న దూరహంకారం ప్రజాస్వామ్యంలో సరికాదన్నారు. ఇలాంటి విధానం బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఉందన్నారు. అందుకే కేంద్రంలోని బిజెపి నాయకుడు జివిఎల్.నరసింహారావు ఆ జీవోను సూటిగా సమర్థిస్తున్నాడని, మరో నేత తెలంగాణ బండి సంజయ్ వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడన్నారు. ఇది బిజెపి ద్వంద్వ నీతికి నిదర్శనం అన్నారు. బీజేపీ విధానాన్ని రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నాడని, దీన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. ఆ జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. లేనిపక్షంలో వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, నాయకులు మారుతిప్రసాద్, జగ్గలి రమేష్, సాకే నాగరాజు, రంగమ్మ, అబ్దుల్లా, చంద్ర, కిషోర్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలి

వినతిపత్రం అందజేస్తున్న యానిమేటర్లు

ప్రజాశక్తి-గుత్తి

యానిమేటర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక వెలుగు కార్యాలయం వద్ద సిఐటియు అనుబంధ సంస్థ ఏపీ విఒఎ (యానిమేటర్లు) ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యానిమేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. బీమా సౌకర్యం, అర్హత గల వారికి పదోన్నతి కల్పించాలన్నారు. తొలగించిన యానిమేటర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏపీఎం మల్లికార్జునకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో విఒఓ ఉద్యోగుల సంఘం నాయకులు అశోక్, నాగమ్మ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : గ్రామాల్లోని మహిళా సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న యానిమేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ స్థానిక స్త్రీశక్తి భవనం వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. యానిమేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కాలపరిమితి సర్కులర్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉషోదయ యానిమేటర్ల సంఘం మండల అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, కార్యదర్శి దస్తగిరమ్మ, కోశాధికారి. మధ్య, హరీశమ్మ, శ్రీరాములు, ఎరికలయ్య తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు తొలగించడం అన్యాయం

ప్రజాశక్తి-పుట్లూరు

హౌస్ మ్యాపింగ్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల పింఛన్లు తొలగించడం అన్యాయమని సిపిఎం నాయకులు విమర్శించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. వైసిపి మూడేళ్ల పాలనలో పుట్లూరు మండలంలో వందల మంది పింఛన్లు తొలగించారన్నారు. ప్రస్తుతం నిబంధనల పేరుతో 105 మంది లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. పేద ప్రజలను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తే సహించేది లేదన్నారు. వెంటనే పింఛన్ల రద్దు ప్రక్రియను ఉపసంహరించుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి విటి.రామాంజినేయులు, సహాయ కార్యదర్శి ఎస్.సూరి, నాయకులు గుత్తా వెంకటచౌదరి, వి.వెంకటశేఖర్, టి.పెద్దయ్య, బి.భాస్కర్‌రెడ్డి, పింఛను లబ్ధిదారులు పాల్గొన్నారు.

10న టెంకాయల విక్రయ హక్కు వేలం

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన శ్రీ బొలికొండ రంగనాథ స్వామి ఆలయం వద్ద టెంకాయలు విక్రయ హక్కు కోసం ఈనెల 10వ తేదీన బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ వేల్పుల సోమశేఖర్ యాదవ్, కార్యనిర్వాహణాధికారి వి.దేవదాసు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు జరిగే స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా టెంకాయలు విక్రయించడానికి హక్కుకు వేలం నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి 8వ తేదీ నుంచి ఏడాది పాటు టెంకాయలు విక్రయ హక్కు కోసం కూడా వేలం నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. ఆసక్తి గలవారు రూ. 5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు. అలాగే మిశ్రమ బియ్యం కొనుగోలు కోసం వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

6 నుంచి 9 వరకు ఐద్వా అఖిల భారత మహాసభలు

ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి

ఐద్వా జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 13వ మహాసభలు ఈ నెల 6 నుంచి 9వ తేది వరకు కేరళ రాష్ట్రంలోని తివేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి తెలిపారు. గురువారం జిల్లా నుంచి ఐద్వా నేతలు అఖిల భారత మహాసభలకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ఐద్వా జెండాలను ఆవిష్కరించారు. అనంతపురం రూరల్ మండలం ప్రజాశక్తి కాలనీలో నిర్వహించిన కార్యక్రమానికి ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి ముఖ్య అతిథిగా హాజరై ఐద్వా జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మహిళలపై హింస, దాడులు, హత్యలు పెరిగిపోయాయని తెలిపారు. మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు ఉన్నా కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నట్లే ఉందన్నారు. రోజు రోజుకీ దాడులు పెరుగుతూనే ఉండటం ఆందోళనకరంగా ఉందన్నారు. బేటీ బచావో, బేటీ పడావో, దిశా చట్టం ఉన్నా రక్షణ కరువైందన్నారు. 33 శాతం రిజర్వేషన్లు ఇంతవరకు అమలుకావడం లేదన్నారు. మహిళల రక్షణ, భద్రతకు ప్రభుత్వాలు పనిచేయాలన్నారు. ఆ మేరకు మహిళా సమస్యల పరిష్కారానికి రాబోవు మూడేళ్ల పాటు పోరాట కార్యాచరణను ఈ మహాసభల్లో తీర్మానిస్తారన్నారు. 4 రోజుల పాటు నిర్వహిస్తున్న మహాసభలకు దేశ నలుమూలల నుంచి వెయ్యి మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లో ఐద్వా జెండా ఆవిష్కరణలు జరుగుతున్నాయని తెలిపారు. నగరంలో నిర్వహించిన కార్యక్రమానికి ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, అరుణమ్మ, కేశవిలత, బుక్కరాయసముద్రం నాగమ్మ, మునిజ, పద్మ, గార్లదిన్నెలో లక్ష్మీదేవమ్మ, ఝాన్సీ, శ్రీదేవి, గుంతకల్‌లో రంగమ్మ, జ్యోతి, లక్ష్మి తదితరులు జెండా ఆవిష్కరణలో పాల్గొన్నారు.

రాజకీయ రంగుపులిమి కడుపుకొట్టొద్దు

విలేకరులతో మాట్లాడుతున్న ఎండిఎ యాజమాన్యం

ప్రజాశక్తి-తాడిపత్రి

ఏళ్ల తరబడి పరిశ్రమల మీద ఆధారపడి బతుకుతున్నాం.. మాకు రాజకీయ రంగు పులిమి కడుపు కొట్టొద్దంటూ యాడికి మండలం రాయలచెరువుకు గ్రామానికి చెందిన ఎండిఎ యజమానులు రాజకీయ నాయకులకు విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బి కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలు పాటించడం లేదనే కారణంగా ఎపిపిసిబి, ఎపిఎస్‌పిడిసిఎల్ అధికారులు 12 పరిశ్రమలను మూసి వేయించారన్నారు. సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని, రాయలచెరువు గ్రామ పెద్దలు సివి. రమణారెడ్డిని కలిసి ప్రభుత్వ అధికారులతో మాట్లాడి మూతపడిన 12 పరిశ్రమలకు నిబంధనలు సడలించి పునరుద్ధరించాలని విన్నవించామన్నారు. వారు సానుకూలంగా స్పందించి సహకారం అందించే దిశగా చేసే ప్రయత్నాలను స్థానికంగావుండే కొందరు వ్యక్తులు దుర్బుద్ధితో రాజకీయ రంగు పులిమి అడ్డుకున్నారని ఆరోపించారు. దీంతో అవి పూర్తిగా మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎండిఎల్ విషయంలో కొందరు అవకతవకలకు పాల్పడ్డారన్న కారణంగా మైనింగ్ అధికారులు అనుమతులను నిలిపివేశారన్నారు. వారిలో తప్పుచేయని వారు కూడా ఉన్నారన్నారు. దీనికి గ్రామంలోని కొందరు టిడిపి నాయకులు రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేశారన్నారు. తాము టిడిపి సానుభూతిపరులం కాదన్నారు. తమకు ఎమ్మెల్యే సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎండిఎ యజమానులు మాదాల రామకృష్ణ, సాదిక్ హుస్సేన్, శ్రీనివాసులు, సుధాకర్, మధు, మాలిక్, పంపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ ప్రపంచ స్థాయికి ఎదగాలి

శిక్షణ కార్యక్రమంలో ఆర్జేడీ వెంకటక్రిష్ణారెడ్డి

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థీ ప్రపంచ స్థాయికి ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని విద్యాశాఖ ఆర్జేడీ, అనంతపురం డీఈవో ఎం.వెంకటక్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం నగర రాప్తాడు మోడల్ స్కూల్లో సిబిఎస్ఇకి ఎంపికైన అనంతపురం జిల్లాలోని 51 పాఠశాలల హెచ్ఎంలు, ప్రిన్సిపల్స్, టీచర్లతో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్జేడీ, డీఈవో వెంకట క్రిష్ణారెడ్డి, సమగ్రశిక్ష ఎపిసి కె.తిలక్ విద్యాసాగర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆర్జేడీ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చదువుకోవడానికి జగనన్న విద్యాకానుక పేరుతో యూనిఫాం, పుస్తకాలు, షూలు, బ్యాగ్స్, బెల్ట్, టై లు అందిస్తోందన్నారు. విద్యార్థులు శారీరకంగా ఎదగడానికి జగనన్న గోరుముద్ద పేరుతో మంచి పౌష్టిక ఆహారం అందిస్తోందన్నారు. టీచర్లకు కూడా వివిధ రకాల శిక్షణలు ఇస్తున్నామన్నారు. అందులో భాగంగా ప్రతి విద్యార్థీ ప్రపంచ స్థాయికి ఎదగాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా 1000 స్కూల్స్, అనంతపురం జిల్లాలో 51, శ్రీ సత్యసాయి జిల్లాలో 49 స్కూల్స్‌ను సిబిఎస్ఇకి ఎంపిక చేశామన్నారు. 2023-24 విద్యా సంవత్సరం నుంచి ఎంపికైన స్కూళ్లలో సిబిఎస్ఇ అమలు అవుతుందన్నారు. సిబిఎస్ఇ అమలయ్యే స్కూళ్లలో అడ్మినిస్ట్రేషన్ వేరుగా ఉంటుందన్నారు. సిబిఎస్ఇ అమలయితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన పనులపై హెచ్ఎంలు, ప్రిన్సిపల్స్‌తో పాటు ఒక టీచర్‌కి ప్రభుత్వం రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తోందన్నారు. శిక్షణ ఇవ్వడానికి రాష్ట్రం నుంచి ఇద్దరు, జిల్లా నుంచి నలుగు మొత్తం ఆరుగురు ఆర్పీలు ఇచ్చే శిక్షణను శ్రద్ధగా విని నోట్స్ రాసుకుని తర్వాత టీచర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే అందుకు హెచ్ఎం, ప్రిన్సిపాల్ బాధ్యత వహించాలన్నారు. రెండు రోజుల శిక్షణను సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థీ గ్లోబల్ స్టూడెంట్‌గా ఎదగడానికి కృషి చేయాలన్నారు. ఎపిసి మాట్లాడుతూ...సిబిఎస్ఇకి ప్రభుత్వ పాఠశాలలు ఎంపిక కావడం విద్యార్థులు చేసుకున్న అదృష్టమన్నారు. రెండు రోజుల శిక్షణను సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థినీ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం అడ్మిషన్లు, పరీక్షలు ఎలా నిర్వహించాలి, చదువు ఎలా చెప్పాలి, తదితర అంశాల పైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆర్పీలు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతపురం డీవైఈవో పద్మప్రియ, గుత్తి డీవైఈవో శంకరప్రసాద్, డిసిఇబి సెక్రెటరీ లోకేశ్వరరెడ్డి, ఎఎంవో హరిక్రిష్ణ, అసిస్టెంట్ ఎఎంఒ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచిచేయడం నేరమా..? : ప్రభాకర్ చౌదరి

ప్రజాశక్తి-అనంతపురం

ఎంతో మంది నిరుపేదలకు పక్కా ఇల్లు కట్టించి, కరువు ప్రాంతంగావున్న అనంతపురంలో అనేక ప్రాంతాల్లో చెక్ డ్యాములను నిర్మించిన ఫెర్రర్ విగ్రహ ప్రతిష్టాపన చేయడం నేరమా..అని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ప్రశ్నించారు. గురువారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఫాదర్ ఫెర్రర్ విగ్రహావిష్కరణకు దళిత సంఘం నేతల ఆధ్వర్యంలో చేపట్టిన భూమిపూజ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. వారికి మద్దతుగా నిలిచిన విన్సెంట్ ఫాదర్ ఫెర్రర్ విగ్రహ దాత, అవే వ్యవస్థాపక అధ్యక్షులు వైకుంఠం ప్రభాకర్ చౌదరితో పాటు, దళిత సంఘం నాయకులను పోలీసులు అరెస్టు చేసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ తరలించారు. ప్రభాకర్ చౌదరికి మద్దతుగా వందలాది మంది పోలీసుస్టేషన్‌కు రావడంతో ఆయనను విడుదల చేశారు.

నేరాలు ఘోరాలు

బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

హోటల్ నిర్వాకురాలి మెడలో బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన పెద్దవడుగూరు మండలం కాశేపల్లి టోల్‌ప్లాజా వద్ద గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. కాశేపల్లి గ్రామానికి చెందిన గణేశం రమేష్‌రెడ్డి 44వ జాతీయ రహదారి పక్కన హోటల్ నిర్వహిస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున ఆయన భార్య సుహాసిని హోటల్లో పనిచేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి టీ ఇవ్వాలని అడిగారు. సహాసిని గ్లాసులో టీ పోస్తున్న సమయంలో ఆమె మేడలోని బంగారు గొలుసు లాక్కుని అతనిపాటు వచ్చిన వ్యక్తి ద్విచక్రవాహనంలో ఉడాయించారు. సుహాసిని పెద్దగా కేకలు వేసినా ఫలితం లేకపోయింది. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజశేఖరరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-గుమ్మగట్ట

బ్రహ్మసముద్రం మండలం తిప్పయ్యదొడ్డి గ్రామంలో నివసిస్తున్న బాలరాజు (30) భైరవానితిప్ప జలాశయంలో పడి గురువారం అనుమానస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ బంధువులు మాట్లాడుతూ బాలరాజు గ్రామంలో అందరితో సఖ్యంగా మెలిగేవాడు. ఎవరితో ఎలాంటి విభేదాలు కూడా లేవన్నారు. అయితే ఈ మధ్యనే పంట పొలాల కోసం అప్పులు చేసి బోర్లు వేశాడని తెలిపారు. ఈనేపథ్యంలో బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళిల కనిపించలేదన్నారు. గురువారం మధ్యాహ్నం బిటిపిలో మోకాళ్ల లోతులో ఉన్న నీటిలో శవమై తేలడంతో అనుమానాస్పదంగా ఉందన్నారు. ఈ విషయంపై గుమ్మగట్ట ఎస్ఐ సునీతని వివరణ కోరగా అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని కరిడికొండ గ్రామంలో ఓ నాటు సారా విక్రేత ను సెబ్ అధికారులు గురువారం అరెస్టు చేశారు. గ్రామానికి చెందిన సుంకన్న అనే వ్యక్తి నాటుసారా విక్రయిస్తుండగా సెబ్ సిఐ బి.వరలక్ష్మి ఆధ్వర్యంలో దాడిచేసి పట్టుకున్నారు. విక్రేతను అరెస్ట్ చేసి అతని వద్ద ఉన్న 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు సెబ్ సీఐ తెలిపారు. నిందితున్ని కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు అదేశించినట్లు ఆమె వెల్లడించారు.

చీకటి జీవోను రద్దుచేయాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రజల గొంతు నొక్కే విధంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన చీకటి జీవోను వెంటనే రద్దుచేయాలని మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ పురుషోత్తం పేర్కొన్నారు. చీకటి జీవోను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ టిడిపి ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ప్రాంగణంలోని గాంధీ విగ్రహం ఎదుట గురువారం నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన చీకటి జీవోను, 1861 పోలీస్ యాక్ట్‌ను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరించడం సరికాదన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు బహిరంగ సభలకు ప్రజలు తండోపతండాలుగా తరలిరావడాన్ని చూసి ఓర్వలేక వైసిపి ప్రభుత్వం ఇష్టానుసారంగా జీవోలు విడుదల చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ విధానానికి ఇది నిదర్శనం అన్నారు. చీకటి జీవోను ఉపసంహరించుకోకపోతే ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రెవెన్యూ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షులు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి మోపిడి గోవిందు, వజ్రకరూర్ మండల కన్వీనర్ వెంకటేశులు, మాజీ సర్పంచులు వెంకటేశులు, ఓబులేసు, 11వ వార్డు సభ్యులు రామాంజనేయులు, ఎస్సీసెల్ మండల అధ్యక్షులు వరప్రసాద్, నాయకులు, ఇంద్రావతి సుధాకర్, మహేష్, వన్నూరు స్వామి, గోపాల్, ఎర్రిస్వామి, రాజేష్, రఘురాములు, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : కుప్పంలో చంద్రబాబు పర్యటనను అడ్డుకోవటం పిరికిపంద చర్య మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాసూల్ చంద్రమోహన్ విమర్శించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన చీకటి జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. చీకటి జీవోలకు తెలుగుదేశం కార్యకర్తలు బయపడరన్నారు. జగన్ నియంత పాలనకు ప్రజలు రాబోవు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెపుతారని హెచ్చరించారు.

పుట్లూరు : టిడిపి అధినేత చంద్రబాబు కుప్పం పర్యటనను అడ్డుకోవటం పిరికిపంద చర్య అని టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన నాయుడు అన్నారు. జగన్‌రెడ్డి విడుదల చేసిన చీకటి జీవో నెంబర్1ని వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఏడేళ్లుగా కుప్పం ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన చంద్రబాబును తన నియోజకవర్గంలో పర్యటించకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయటమేనని అన్నారు. వైసిపి ప్రభుత్వం చీకటి జీవోలకు టిడిపి కార్యకర్తలు బయపడరన్నారు. జగన్ నియంతృత్వ పాలనకు ప్రజలు రాబోవు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెపుతారని హెచ్చరించారు.

పాతబకాయిలు రికవరీ చేయండి

ప్రజాశక్తి -పెద్దవడుగూరు

గత సామాజిక తనిఖీల్లో బయట పడిన బకాయిలను వెంటనే రికవరీలు చేయించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు డ్వామా జిల్లా విజిలెన్స్ అధికారి వైపి. రమణారెడ్డి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మండల వ్యాప్తంగా 2012-13కు సబంధించి పనులపై సామాజిక తనిఖీ జరుగుతోందన్నారు. గత సామజిక తనిఖీల్లో బయట పెట్టిన అవినీతి నిధులను రికవరీలు చేయాలన్నారు. పనులు చేసిన ప్రాంతాల్లో పేర్ల బోర్డులను చేసినందున వాటికి సంబంధించిన రూ.1.64 లక్షల నిధులు పంచాయతీ గ్రాంట్లలోనే ఉందన్నారు. ఆ నిధులను మండల ఖాతాకు బదిలీ చేయాలని చెప్పారు. అనంతరం మండల వ్యాప్తంగా ఉపాధి పనులు, సామాజిక తనిఖీ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుళ్లాయిస్వామి, ఏపీవో పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ రాజకీయనేత అనంత వెంకటరెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

ఆదర్శ రాజకీయ నేత అనంత వెంకటరెడ్డి అని వక్తలు కొనియాడారు. గురువారం అనంత వెంకటరెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ సర్వజనాసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, ప్రకాష్ రెడ్డి,పెద్దారెడ్డి, జడ్పీ ఛైర్మన్ గిరిజమ్మ, మేయర్ వసీం పులమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నికార్సైన రాజకీయాలు చేసిన నెత అనంత వెంకటరెడ్డి అని అభివర్ణించారు. ఎమ్మెల్యే అనంత వెంటరామిరెడ్డి మాట్లాడుతూ హంద్రీ నీవా జాలాలు వచ్చేందుకు కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన బాటలో పయనించి ఆశయాల అమలుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

అనంత వెంకటరెడ్డికి నివాళులు అర్పిస్తున్న వైసిపి నాయకులు